క్లుప్తంగా

పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్ రెడ్డి



రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం నుంచి ఆయన ఎమ్మిగనూరుకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం (ఏఐజీడీఎస్‌యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎరుకల కృష్ణ, పోస్టల్ ఫెడరేషన్ బ్రాంచ్ అధ్యక్షుడు విజయలక్ష్మి, సీనియర్ పోస్టుమాస్టర్ ఎండీ గోపాల్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు. ఎమ్మిగనూరు బ్రాంచ్ పరిధిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు నాగరాజుస్వామి, మునిస్వామి, పద్మ, తులసి, కౌలుట్లమ్మ, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు సీఐకు సన్మానం

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలక పాత్ర పోషించారని ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నారు. బన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆలూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. కమిటీ నిర్వాహకులు వీరనాగప్ప, మంజునాయక్, సోమప్ప, చిన్న మల్లికార్జున గౌడ్, సాదన్న తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

కబడ్డీ విజేత చిట్యాల జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన ఓపెన్ కబడ్డీ పోటీల్లో చిట్యాల జట్టు విజేతగా నిలిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 42 జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్‌లో చిట్యాల జట్టు విజేతగా నిలిచింది. తరువాతి స్థానాల్లో వరుసగా గూడూరు మండలం అయ్యకొండ జట్టు, కోడుమూరు మండలం కే.చనుగొండ్ల జట్టు, ఆత్మకూరు మండలం సాంబపురం జట్టు గెలుపొందాయి. విజేతలకు దాతలు గంగిరాయుడు, రాముడు, అంజినేయులు, గురుస్వామి, గోపాల్, మహేష్, కిట్టు, శివ సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం



పూర్తిగా కాలిపోయిన సెల్‌ఫోన్లు, విడిభాగాలు

దేవనకొండ: మండల కేంద్రంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నేలతలమరి గ్రామానికి చెందిన రామచంద్ర దేవనకొండలో రాము మొబైల్స్ పేరిట షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ఏర్పడ్డాయి. దుకాణంలోని మొత్తం సామగ్రి కాలి బూడిదైంది. దాదాపు రూ.6 లక్షలు విలువ గల మొబైల్స్, విడిభాగాలు, రిపేరీ పరికరాలు కాలి బూడిదయ్యాయని బాధితుడు రామచంద్ర వాపోయాడు.

పన్ను చెల్లించకపోతే నోటీసులు

ఆలూరు: పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 150 గ్రామ పంచాయతీలలో పన్ను బకాయిలు చెల్లించకపోతే నోటీసులు జారీ చేస్తామని డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటిపన్ను, డంపింగ్ యార్డు, గ్రామంలో తాగునీరు, పారిశుధ్య పనులు తదితర వాటిపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఆయా పంచాయతీలలో పన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులు గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పన్ను బకాయిలు చెల్లించని వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి

ఎమ్మిగనూరుటౌన్: పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని సామాజికంగా, ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలని, అప్పుడే పేదల అభ్యున్నతి మరింత మెరుగవుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కుర్ణి కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నందవరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముందుగా ఎమ్మెల్యే 'మా నమ్మకం నువ్వే జగన్' బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్నారు. ప్రజల కోసం విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతూ నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ కుటుంబమూ బాగుపడిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో ఆర్థిక లబ్ధి చేకూరిందని వివరించారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, చేయూత, ఆసరా, రైతు భరోసా, నేతన్న నేస్తం లాంటి పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుందన్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి చేపట్టనున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

గురించి వివరించడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన మోసాన్ని వివరించి చైతన్యం చేయాలని సూచించారు.

మాజీ సీఎం చంద్రబాబునాయుడు అవినీతికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు లభించడంతోనే అరెస్ట్ చేసి జైలుకు పంపారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. టీడీపీ అక్రమాలకు కేరాఫ్‌గా మారితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకెళుతోందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి లక్ష్మికాంతరెడ్డి. ఎంపీపీ నసురుద్దీన్, ఆయా మండలాల కన్వీనర్లు దొరబాబునాయుడు, శివప్ప గౌడ్, వైస్ ఎంపీపీ వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బందెనవాజ్, విరూపాక్షిరెడ్డి, మన్సూర్, మల్లికార్జునరెడ్డి, చాంద్, హజరత్, అతావుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న గోనెగండ్ల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు

టౌన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి

స్థానిక టౌన్ బ్యాంక్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారం అందిస్తామని సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక టౌన్‌బ్యాంక్‌లో సీఈఓ గంగాధర్, తాజా మాజీ చైర్మన్ యూకే రాజశేఖర్, సిబ్బందితో బ్యాంకు అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చించారు. బ్యాంకు పాలకవర్గ పదవీకాలం ముగియడంతో మళ్లీ గడువు పొడిగింపు కోసం పంపిన ప్రతిపాదనల గురించి అడిగి తెలుసుకున్నారు. పాలకవర్గానికి మళ్లీ అవకాశం రానుండటంతో సిబ్బందితో కలిసి బ్యాంక్ లాభాల బాటలో పయనించేలా కృషి చేయాలన్నారు.

గ్రామ స్వరాజ్యం, సమగ్ర అభివృద్ధే లక్ష్యం



చెరుకులపాడులో నిర్మించిన ఆర్బీకే, హెల్త్ క్లినిక్ వద్ద ఎమ్మెల్యే శ్రీదేవి తదితరులు

వెల్దుర్తి (కృష్ణగిరి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో నవశకానికి నాంది పలికి ప్రజల ముంగిటకే సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామ స్వరాజ్య స్థాపన, ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పనులు చేపట్టడంతో సమగ్ర అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె సోమవారం తన స్వగ్రామం చెరుకులపాడులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.20.80 లక్షలతో నిర్మించిన వీహెచ్‌సీల శిలాఫలకాలను ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో గ్రామాల స్వరూపమే మార్చేసిందన్నారు. గ్రామగ్రామాన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఇతరత్రా పలు ప్రభుత్వ భవనాలు నిర్మించి, లక్షలాది ఉద్యోగులను నియమించి పాలనను ప్రజలకు చేరువ చేసిందని చెప్పారు. నాలుగున్నరేళ్లలోనే దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి సాధించిందన్నారు. నవరత్నాలతో పాటు, పలు సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. వైఎస్సార్‌సీపీ



ఆర్బీకే వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ప్రదీప్ రెడ్డి

పాలనలో నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వాటిని పూర్తిచేసి చూపామన్నారు. వీధి వీధినా సీసీ రోడ్లు, గ్రామగ్రామాన రహదారులు మొదలుకొని, తాగునీటి వసతి, చెరువులకు నీరు అందించి, పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి సాధించడం జరిగిందని వివరించారు. అనంతరం హైస్కూల్, ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మహేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్‌రెడ్డి, శివారెడ్డి, పీఆర్ డీఈ శేషయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ రాములమ్మ, ఏఓ అక్బర్‌బాష, ఏఈ సురేంద్రనాథ రెడ్డి, వైద్యాధికారి భువనతేజ, సీహెచ్‌ఓ కరుణాకర్, సురేంద్ర శెట్టి, వ్యవసాయ, ఆర్బీకే, వైద్య, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు 25 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, తిరుపతమ్మ, జక్కల హరి, మద్దిలేటి, రామచంద్ర, బాల గంగాధర్, రంగముని, మారెప్ప, చిన్నరంగన్న, రంగడు తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు మెచ్చి పార్టీలోకి చేరినట్లు వారు చెప్పారు.



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించండి

తుగ్గలి: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్‌తో పాటు ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని ఎంఈఓ-2 రామ వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. నవంబర్ 10వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా, రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 16వ తేదీ వరకు, రూ.200 ఫైన్‌తో 22వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో 30వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

గోనెగండ్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గోనెగండ్ల 1వ వార్డులో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెత్తందార్ల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు పనిచేస్తే, పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగనన్న పని చేస్తున్నారని చెప్పారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే అందుకు నిదర్శనమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. గోనెగండ్లలో తాగునీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసిందని, ఆ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. పనులు పూర్తయితే ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇస్తారని తెలిపారు. అలాగే గ్రామంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు దొరబాబు, మనోహర్ రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన



హత్తిబెళగల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



పెద్దనేలటూర్‌లో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో 524 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకోగా 15 మందికి కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు ఈరన్న, తిమ్మన్న, గుల్నాజ్ సూపర్‌వైజర్ పద్మలత గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉరుకుందప్ప ఏఎన్‌ఎంలు, 104 సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష

సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు సోమవారంతో ముగిసింది. మండలంలో రెండు పీహెచ్‌సీలు కలిగిన మొలగవల్లి, కమ్మరచేడు గ్రామ సచివాలయాలు మినహాయించి 15 గ్రామ సచివాలయాల పరిధిలో సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. హెల్త్ క్యాంపుల్లో 6,363 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 332 మందికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య శ్రీ కింద కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 702 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 55 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు వైద్యులు వెల్లడించారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ సచివాలయం-2 పరిధిలోని పాఠశాలలో సోమవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు కార్తీక్, రుక్సానా, శ్రీదేవి, విష్ణువర్ధన్ నాయక్ వైద్య సిబ్బంది శిబిరంకు వచ్చిన 409 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో నేడు సమావేశం

పత్తికొండ రూరల్: ఓటర్ల జాబితా రూపకల్పనపై పత్తికొండలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ నీలపు రామలక్ష్మి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లైతే తెలియజేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేంద్ర సోమవారం తెలిపారు. ఈనెల 9వ తేదీన కర్నూలు, నంద్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-14 విభాగంలో మమత, కార్తీక్‌కుమార్, అండర్-17 విభాగంలో గౌతమి సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నిస్సార్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలూరు: స్థానిక సాయిశ్రీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న హిమవర్ష రెడ్డి రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26న నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సెలక్షన్ పోటీల్లో ఆమె సతాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రేపల్లె అర్చన, ఏఓ అరికెర రామిరెడ్డి, పీఈటీ హసన్ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో క్రీడాకారిణిని ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుంటే చర్యలు



వ్యాపారస్తులకు సూచనలు చేస్తున్న అధికారులు

గోనెగండ్ల: ఎమ్మిగనూరు – కర్నూలు రోడ్డు స్థలంలో బంకులు ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ తిమ్మారెడ్డి వ్యాపారస్తులను హెచ్చరించారు. సోమవారం వారు ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రధాన రహదారిపై పర్యటించి వ్యాపారస్తులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిలో రోడ్డుకిరువైపులా అక్రమంగా బంకులు, షెడ్లు, పానిపూరీ, ఫాస్ట్‌ఫుడ్స్, బజ్జీల బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో ఆ దారిలో వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతో రోడ్డులో ఏర్పాటు చేసుకున్న బంకులను తొలగించడం జరుగుతోందన్నారు. అలాగే హోటల్ నిర్వాహకులు రోడ్డుపై నీళ్లు చల్లడం, చెత్త వేయడం చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యాలయం ఇన్‌చార్జ్ సతీష్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల వృద్ధి

ఆలూరు: ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని ఏపీడీ పక్కీరప్ప రైతులకు సూచించారు.ఆలూరు సమీపంలో ఉపాధి కూలీలు చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ, టీసీ, ఈసీ, కోపా, ఎఫ్‌ఏలు, టీసీ తదితరులతో సమావేశం నిర్వహించారు. జల వనరులను సంరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫారం పాండ్స్, డక్ అవుట్స్, మొక్కల పెంపకం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే తక్కువ నీటితో లాభసాటి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. అలాగే వలసలను అరికట్టేలా ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.



ఇంకుడు గుంత తవ్వకాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

మద్దికెర: వాతావరణంలో మార్పుల వల్ల మండలంలోని ఆయా గ్రామాలలో జ్వరాలు ప్రబలుతున్నాయని, జ్వరం పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. సోమవారం ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ.. గ్రామాలలో జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులు ఇప్పించాలన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సావిత్రిబాయ్ పూలే, షేక్ ఫాతిమా విగ్రహాలను సోమవారం సర్పంచు కొమ్ము దీపిక ఆవిష్కరించారు. సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హెచ్‌ఎం వెంకమ్మ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సర్పంచు కొమ్ముదీపిక, విగ్రహాల దాత, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర నాయకుడు ఎస్.రోషన్‌అలీ, ఎంఈఓ మస్తాన్ వలి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఏపీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే, ఫాతిమాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.



సావిత్రిబాయ్ పూలే, షేక్ ఫాతిమా విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కొమ్ముదీపిక

అభివృద్ధి బాటలో నడవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఫ్యాక్షన్ వైపు వెళ్లి కుటుంబాలు నాశనం చేసుకోవద్దని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం రాత్రి మల్లెపల్లె గ్రామంలో పోలీస్ పికెటింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఫ్యాక్షన్‌తో ఒరిగేది ఏమీ లేదని, జీవితాలతో పాటు కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. పంతాలు పట్టింపులకు పోకుండా అందరూ ఐకమత్యంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి వెంట ఉన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ పూజ చేసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీల ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్న గ్రామంలోనే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.270 వరకు కూలి వస్తుందని చెప్పారు. ఎంపీటీసీ నామాల శ్రీను, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి 2వ వార్డులో వెలసిన పెద్ద దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. నిర్వాహకుడు మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా గ్రామంలో గంధోత్సవం, ఉరుసు, భజనలు, అన్నదానాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సోమవారం కిస్తీ ఉత్సవం సందర్భంగా విరివిగా విచ్చేసిన భక్తజనం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

15 గొర్రెల అపహరణ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సూదాపల్లె గ్రామానికి చెందిన తప్పెట జయరాముడుకు చెందిన 15 గొర్రెలు అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 10న రాత్రి గ్రామంలోని బోయ బాలరాముడు పొలంలో గొర్రెల మంద నిలిపిఉంచారు. ఉదయాన్నే మందను సరిచూసుకోగా 15 గొర్రెలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలను అపహరించినట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీటి విలువ దాదాపుగా లక్షన్నర ఉంటుందని ఆయన తెలియజేశారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

వెల్దుర్తిలోని బైరిపోగు చిన్న మద్దిలేటి అనే వ్యక్తి ఇంటి వద్ద సోమవారం 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

పత్తికొండ రూరల్: ఆదోని నుంచి ప్రారంభమైన సీపీఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర పత్తికొండకు చేరుకుంది. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఆ పార్టీ మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు చేస్తే అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం అన్యాయమన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కృష్ణయ్య, శివ, నాగమణి, జిల్లా కార్యదర్శి గౌస్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆలూరు: కరువు పరిస్థితులతో అల్లాడుతున్న రైతులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ కోరారు. సీపీఎం ప్రజారక్షణ భేరి యాత్ర సోమవారం ఆలూరు చేరుకోగా ఆయన మాట్లాడారు. జిల్లాలో వర్షాభావంతో ఎండిన పంటలను అధికారులు పరిశీలించి కరువు నివేదిక రూపొందించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

తాగునీరు అందించండి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతూ సోమవారం సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ శివరాముడుకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. హంద్రీ-నీవా రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సారా విక్రేత అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన ఏకాసి రామాంజినేయులు తన కల్లందొడ్డిలో నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఇతని వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టీబీ డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువ ఆంధ్రా సరిహద్దు 250 కి.మీ వద్ద కూడా నీటి ప్రవాహం తక్కువగా నమోదైంది. దాదాపు 600 క్యూసెక్కులకు గాను సోమవారం ఉదయం 428 క్యూసెక్కుల నీటి ప్రవాహం మాత్రమే ఉంది. గత కొద్ది రోజులుగా సాగునీటికి డిమాండ్ పెరగడం, పైభాగంలో జలచౌర్యం వల్ల పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం ఉండడంలేదని ఏపీ రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో 8,943 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే సమయానికి డ్యాం నిండి కళకళలాడుతుండేది.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలు త్వర గా పరిష్కారమవుతాయని తహసీల్దార్ నిత్యా నందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు హాజరయ్యా రు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ రవీంద్ర, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్నలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

నందవరం: గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరరెడ్డి, మండలాధ్యక్షుడు గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, ఉపాధి పనులు కల్పించాలని కోరారు.